స్వర్గమా, నరకమా?

నమోదు సంఖ్య: 031 ....
తేది. 21-10-1986 ....

కొల్లూరు ధర్మారావు

చిన్నప్పుడు మా అమ్మ పురాణం చదివి అర్థం చెపుతూండేది దగ్గరవున్న అమ్మలక్కలకు. పుణ్యం చేసుకున్న వాళ్లకి ఉత్తర జన్మలేకుండా స్వర్గం వొస్తుందనీ, పాపకర్మ ఆచరించినవాళ్లు నరకంలో ప్రవాసం అనుభవిస్తారనీ, వ్యాఖ్యానాలు చేసేది. కొంత కాలం దాకా నాకూ స్వర్గమంటే ఆశా, నరకమంటే భయమూ వుండేవి. అయితే నా ప్రస్తుతపరిస్థితులలో, ఆ రెండూ కలగలుపై ఇక్కడే అనుభవమౌతాయనీ, సంఘం యొక్క ఆగ్రహానుగ్రహాలకే శాస్త్రాల్లో ఆ పేర్లు పెట్టేరనీ యిప్పుడు తోస్తూంది. నేను పూర్తిగా పాపమని నమ్మిన కృత్యాన్ని లోకమంతా హర్షించి, దానిమీద పుణ్యమని చెలామణీముద్ర వేసింది. నేను కాశీవెళ్లినంత పుణ్యమని తలపెట్టిన కార్యం సంఘమునకు రాక్షసంగా తోచి యిప్పుడు నేనున్నస్థితికి నన్ను తెచ్చింది.

* * * *

మా తల్లిదండ్రులకు నేనొక్కర్తెనే కూతుర్ని; మాఅన్నయ్య ఒక్కడే కొడుకు. మాయిద్దరికీ మూడేళ్లు వయస్సులో వ్యత్యాసం వున్నా, నేను చిన్నప్పటినుంచీ కొంచెం ఒత్తరిమనిషిని కావడాన్ని కొత్తగా చూచిన వాళ్లు మమ్మల్ని కవలనుకునేవారు. కొంచెం ఉపాధిగల బ్రాహ్మణ కుటుంబాల రీతిగానే, మాయింట్లోకూడా మాఅమ్మమ్మ ముచ్చట తీరడానికని మాఅన్నయ్య ఉపనయనంతోటే నాకు పెళ్లికూడా కోలాహలంగా చేసేరు. అప్పటికి నాకు ఆరోయేడు. నాకు జ్ఞప్తివున్న విషయమల్లా, మా అన్నయ్యకి జడ కండేటంత జుట్టు తీసేసి సిరామరకల్లాగ పంచసిగలుంచడం, అది చూసి అందరితోపాటు నేనూ నవ్వడం. తెల్లారుజామున — ఇంకా మూడోగంట అయిందో లేదో — మా అమ్మ నన్ను లేపేసింది. నేను బద్ధకిస్తూ లేచేను కాని, మంగళస్నానానికి అనేసరికి నాకు చికాకేసింది ఆ అర్ధరాత్రప్పుడు. "బానతో నువ్వా పోసుకోవా" లని మా అమ్మ తొందరపెట్టింది ... ... కాని అప్పట్లో మా పార్వతీశంబావ మా యింటికేనా వచ్చినట్టు నాకు జ్ఞాపకం లేదు. ఎందుకొస్తాడూ? మాయిద్దరిమధ్యనీ యిలాంటి విషాదజ్వాల పుట్టించి సంఘం గంతులెయ్యగలుగునా అప్పుడు వాడొస్తే? * * * ఏమయితేనేం? అప్పుడు నాకేం తెలీలేదు. అది మాఅన్నయ్యవడుగనేకాని నాపెళ్లి అన్న విషయమే నాకర్థంకాలేదు. నాకేమిటి, మా నాన్నకే తెలీదూ; అంతా అప్పటికప్పుడు కుదిర్చేరుట, మా అమ్మమ్మతొందరచేత.

* * * ఏనాళ్లకి వెళ్లేమటగాని, నాకది యేమీ జ్ఞప్తిలేదు.

ఆసంవత్సరం శ్రావణంలో నోముకోసం నన్ను తీసుకెళ్లాలని పిలుపునిమిత్తం మాఅమ్మ ఎదురుచూసింది. అయితే విధివశాత్తూ, మా కామేశ్వరత్తకి చాలాజబ్బుగావుందని టెలిగ్రాం రాగానే, మాఅమ్మమ్మని యింట్లో పెట్టి మేమందరం నేరుగా వెళ్లిపోయేం. మాఅత్తకి పార్వతీశం ఒక్కడే కొడుకు. మరి పిల్లలు లేరు. ఆపిడపెనిమిటికి ఉప్పుగల్లీమీద ఉద్యోగం. రెండుచేతులా ఆర్జించే డబ్బంతా చిల్లిగవ్వలా ఖర్చుపెట్టే మనిషి. అతని కేసు వంకలా మేనత్తప్ప, నాఅనేవా రెవరూ లేరు. అతనికీ మాఅత్తకీకూడా నేను పుట్టినప్పట్నించీ నన్ను పార్వతీశానికి చేసుకుందామని వుండేది. అయితేనేం? మాలో మేనరికాలు ఇప్పటికి కెవరూ చెయ్యలేదట; అంచేత "యెలా యివ్వనూ?" అంది మాఅమ్మమ్మ. మా అమ్మమ్మ అంటే కేవలం మాటనేర్చిన శాస్త్ర స్వరూపం, నడకయెరిగిన వృద్ధాచారం. ఆపిడ చెప్పే వావులూ వరసలూ, వాళ్లో నిషిద్ధాలూ ద్వితీయపక్షాలూ సంఘానికి వేద వాక్కులు. నాపాలిట దాపరించిన సజీవనిర్ణయసింధువు ఆమె. * * * మేం వెళ్లేసరికి మాఅత్తస్థితి బాగులేదు. జ్వరతీవ్రంలో చెరుపుగా మగ్గాగా ఉంది. "కామేశ్వరీ, చూడూ, మీఅన్నయ్యా పిల్లలూ వొచ్చేరు పలకరించు" అని మామయ్య అనేసరికి మాఅత్త అరమూసిన కళ్లు విప్పి యెదట్ట నన్నుచూసి "కూచోవే కోడలా" అంది. మా అమ్మని పలకరించలేదు. మా నాన్నవంక చూడలేదు. నా కప్పు డర్థమైంది నా పెళ్లికి మా అత్తావాళ్లు యెందుకు రాలేదో. మాబావ రాకుండా నాకొక్కర్తెకీ పెళ్లి చేసేసేరు మావాళ్లు! తప్పుకాదూ?

* * *

నా జీవితంలో సుఖదుఃఖాలు క్షీర నీరంగా కలిసి నాకు తెలుసుకొగని అనుభవాలు సంభవించడం నా యేడవయేట ఆరంభం. మాపార్వతీశంబావ మాయింట్లోనే మాతో బుట్టలాగున్నా డప్పట్నించీ. మాఅన్నయ్యా వాడూ అన్నందగ్గిర కూర్చున్నప్పుడు వాళ్లిద్దరిమధ్యా నాకంచం ఉండాలని దెబ్బలాడేదాన్ని. మాబావకి పెందరాళే ఆకలేస్తే నేనుకూడా ఆకలి లేకపోయినా వాడితో పంక్తికి సిద్ధపడేదాన్ని. మాఅమ్మమ్మ నన్ను చూసి "ఒసే, అమ్మీ, ఆడపిల్లవి, ఇంత దండుతన మేమిటే?" అని కోపగించేది. * *

మాఅత్త ఆకాశమంటిన ఆరునెల్లకే నామీద — నామీదయేమిటి? నాకు చీమ కుట్టినట్టనా లేదూ; మావాళ్లమీద — ఉఱుమని పిడుగు పడ్డాది. కలరా వచ్చి ఆయన..."ఆయన" అనాలని లోకం మప్పిన మాట కాని, నాతో నాలుగుపూటలు హోమ ధూమంలో కళ్లుమండిపోతూ పీటలమీద కూర్చోపెట్టిన కుర్రాణ్ణి, అదివరకు కాని, ఆపిమ్మటకాని నే నెన్నడూ చూడని అబ్బాయిని, నేను 'ఆయన' అనడానికే నాకు

సిగ్గేస్తూంది. మాయింకాకుండా ఉంటే, ఆ అబ్బాయిని నేను మర్యాదగా చూడడం నేర్చుకొనేసరికి యెన్ని సంవత్సరాలు పట్టేదో? ... టెలిగ్రాం చూసి మానాన్న కిక్కసచ్చి పోయేసరికి, మా అమ్మమ్మ నన్ను పక్షిలాగ యెట్లాపోల్చేసిందో "నాయనా, అమ్మికొంప మునిగిందా?" అని భోరున నామీద తిరిగి పడ్డాది. మా అమ్మకూడా నన్ను పట్టుకుని యేడవ ప్రారంభించింది. నాకేమీ కారణం తెలియలేదు. మా పొరుగింటి రంగనాయకమ్మ గారిపిల్లలతో ఆటలాడాలని సమస్తం సన్నద్ధం చేసి, నాకంతు అటుకులూ బెల్లం అడగటానికని నేనింట్లోకి వచ్చేసరికి, మా వాళ్ళు చేసిన గాభరాతో నాకుమతిపోయింది. నేనంతవరకు చూసిన మా అత్తమ్మత్తల్ల వాళ్ళకే; కాని నా మొగుడుకు నేను బ్రతికి వున్నట్టు ధైర్యముందికదా, వీళ్ళంతా నామీదపడి యేడవడమేమిటి? ...... వారం పదిరోజులు దాటగానే బోధపడ్డాది మా అమ్మ నన్ను ఆడుకుండకి పొద్దుటే విడిచేది కాదు. నాకు జడవేస్తూ కళ్ళొత్తుకోడం; బావతో పాటు నాకు అన్నం పెట్టకపోవడం; ఎక్కడికీ కూడా నన్ను వెళ్ళటానికి పంపకపోవడం; మాఅమ్మమ్మదగ్గర పడుక్కోమనడం — ఈ చర్యలన్నీ కొత్తగా అర్థంలేని విషయాల్లాగ కనిపించి, చివరకు నాతో యేవ్యక్తీ మొగం యెదుట చెప్పకుండానే, నేనొక దౌర్భాగ్య వితంతువునని లోకమంతా నన్ను ఒప్పించేరు.

నాడిదో యేట, విశాఖపట్నంలో ముట్ట మొదట మాయింటిమీద వాలింది ప్లేగు వ్యాధి. రాయి విసిరేసరికి పిట్టవెనకనే పిట్ట తుర్రుమని పారిపోయినట్టు మా తల్లిదండ్రులు గతించేరు, వారం రోజుల్లో. మా అమ్మమ్మ నన్నూ, మాఅన్నయ్యనీ, మాబావనీ తోడ్చుకుని పెలుస్తేటను కొబ్బరిండి, వాళ్ళ చెల్లెలు గారి గ్రామం తీసుకుని దడపాం. కాని, మాకు టిక్కెట్లు యివ్వనికారణంచేత మళ్ళీ యింటికే చేరాం. రెండునెలలపాటు జైల్లో వున్నట్టు కాలక్షేపం చేసేం. మా యింటికి యెవరూ రాలేదు, నేం యెక్కడికీ వెళ్ళలేదు. ఆ తర్వాత మా మామయ్య తన కొడుక్కి ఉత్తరం రాసేడు వెంటనే రమ్మని. అతడు చేసుకున్న రెండో భార్య యెదిగి వచ్చాక, యీ కొడుకు కెందుకో తనకి! అయితే మానాన్నపోవడాన్ని రాసివుంటాడు. పార్వతీశం బావ అప్పట్లో నన్ను విడిచి వెళ్ళిపోతే నా బ్రతుకెట్లా వుండేదో! నేను చెప్పకుండానే మాఅన్నయ్య జబాబుగా ఓ కార్డురాసి పడేసేడు, బావ తనతో చదూకుంటున్నాడనీ, పరీక్షలైనాక వొస్తాడనీ. అప్పుడువాళ్ళు చదూతూన్నది నాలుగో ఫారం. మళ్ళీ ఇంటరు క్లాసులో చదూతూన్నదాకా, మా బావ యేడాదికొక్కమాటే వెళ్ళి వాళ్ళ నాన్నవద్ద పదిరోజులుండి తిరిగి వచ్చేసేవాడు. * * *

మాఅన్నయ్య ఓనాడు గదిలో పుస్తకాలు సర్దుతున్నాడు. బావని తోటికుర్రా

డింటికి సైకిలుమీద పంపించే డేవోనోట్సు తెమ్మని. నేను మాఅమ్మతాలూకు వచన భారతం చదూతూ, దానిలో యేదోగళ్ల కాగితం వుంటే తెచ్చి మాఅన్నయ్య కిచ్చేను. అది పరికించిచూచి "పల్లి, నీజాతకం యిది" అన్నాడు. అంటూ యేదోమహాపచారం చేసినట్టు తొందరగా ఆకాగితం చింపేసి, "వెళ్లిచదూకో" అన్నాడు. నా కిప్పుడది తల్చుకుంటే అర్థమౌతూంది; అందులో నాభావిజీవితచర్య వ్రాసివుంది కాబోలు! లోకమంతా వితంతుముద్రవేసిన నాజాతకంలో ఆరోజునే మాఅన్నయ్యకంట పడ్డాదేమో, యీసజీవపరిణామం!... ... ...

ఆనాడు నామీదపడి యింటిల్లుపాదీ యేడ్చినంతయేడ్పు, మళ్లీ నాపన్నెండోయేట మాఅమ్మమ్మ వక్కర్తే ఒకనా డేడ్చింది— నేను స్త్రీజన్మ దాల్చే నప్పుడు! నాశరీరమందు నాకే ఒకవిధమగు వ్యామోహం, ఉత్తేజం జన్మించేయి. వుయ్యాల ఊగేటప్పుడు బారుగా మీదికి గాలిలో తేలిపోయి తిరిగీ క్రిందకు వస్తూన్నప్పుడు వుయ్యాల నంటీఅంటనట్లుండి, శరీరము పుష్పంలాగు జల్లున వికసిస్తుందే, ఆలాగు నా కాపాదమస్తకం ఆవయస్సులో తోచింది. సృష్టిఅంతటా ఒక అవ్యాజమైన ఉత్సాహం కనిపించింది. పంచభూతాలూ నాఆనందంకోసమే వున్నట్టు అర్థమైంది. నాకీస్వర్గసందేశంలో అడుగడుగునా మా అమ్మమ్మరోదనధ్వని భయంకరంగా వినిపించేది. పండువెన్నెట్లో విహరించే పైరుగాలి మధ్య గుడ్లగూబయొక్క వికృతస్వర మది!

* * *

ఒకనాడు మాఅన్నయ్యగదిలో యెవళ్లూ లేనిసమయంలో నిలువుటద్దంవద్ద చేరి క్రాపింగుపన్నెతో జుట్టుసరిజేసుకుంటూ నిల్చున్నాను. మాఅమ్మమ్మ పెరట్లో యేదో మడిపని చేసుకుంటూంది. ఆమె నాచేతిలో అద్దం లాక్కుని ముక్కలుచేసి మూడేళ్లయింది. ఆనాడు నాజీవితచ్ఛాయ వెయ్యితునకలై మంటిలో కలిసింది. నాకు నేనే దూరమైపోయేను. నూతిమీద వంగినా మా అమ్మమ్మ చూస్తే వొప్పేదికాదు; నూతిలో పడిపోతానేమో అని భయంట. ఆమె చేజేతులా నన్ను ముంచిన నడిసముద్రంకన్న యీనూతులు లోతా? నా కవకాశంచిక్కినప్పుడల్లా నా ఒంటరితనం మాన్పుకుందికి నిలువుటద్దమే శరణం. ఈపాడులోకంలో నన్నాదరించి తల్లిలాగు కడుపులో పెట్టుకున్నదది ఒక్కటే. ఎన్నిసార్లు అద్దంలో చూచుకున్నా నాలోనా కేదోకొరత కనిపిస్తూవుండేది. అది ఊహించలేక తంటాలుపడేదాన్ని. నాకనురెప్ప లిలాగ అరవాల్చినా, తేరిబారి చూచినా, నాఛాయలో ఒక శిలావిగ్రహపు నిశ్చైతన్యం ద్యోతక మయేది. *** ఎదురుగా గూటిలోవున్న సీసా తీసి అగరుచుక్క పెట్టుకున్నా; ఏనాడో మాసిపోయిన కళంకం తెచ్చిపెట్టుకున్నా; ఏనాడో మాసిపోయిన కళంకం తెచ్చిపెట్టుకున్నా! ఓరవేసిన గది

తలుపు కిర్రుమని చప్పుడైంది! అమ్మోయ్, మాఅమ్మమ్మకాబోలు. అరచేత్తో నుదురు తుడిచేసుకుని చూతునూ, మా పార్వతీశం బావ!

" అదేమిటి పూర్ణా, నుదురేమీ ? "

అద్దంవైపు తిరిగిచూసేసరికి నుదుట గాయంపడ్డట్టు ఎర్రగా తోకచుక్కలాటి తుడుపుంది. అరిచెయ్యి కత్తికోతపడ్డట్టు రక్తవర్ణిత మైంది. చే నేదోహత్య చేసినట్టు ఆపాదమస్తకం కంపించేను!

"ఏం పూర్ణా, యెందు కంత కంగారు?" అని మాబావ నాభుజంమీద చెయ్యివేసేడు. నాపాలిటి ఇంద్రజాలికు డతడు; సూర్యరశ్మి యెరగని మొరడు చిగిర్చింది ఒక్కసారిగా! పువ్వుత్రుంచినప్పటి మల్లెపొదలాగు నాశరీర మంతా జల్లుమంది! కనుకొలుకులలోంచి నిలువుటద్దంవైపు చూసేసరికి, అదివరకు యేదో అనుకున్న కొరత మాయమైంది. మాబావవక్షముపై ఒరజేసిన నాశిరస్సునకు తల్లియొడిజేరిన శిశువులాటి శాంతి, ఆనందం లభించేయి. ఆనిలువుటద్దంలో ఒకదానిమీద ఒకటి హత్తుకొనిపోయిన మాప్రతిబింబాల మీద ఆనాడు దివిజసంఘములో వున్న మా అత్త ఆశీపాక్షతలు జల్లింది, కరకులోకమంతా మాత్రం కళ్లుకుట్టుకుని, ఆనిమిషమందు మా అమ్మమ్మగొంతులో ప్రవేశించి, కంచుగీసిన గాత్రంతో "అమ్మో"అని ఒక కేక వేసింది!

*　　　*　　　*

నేనుచేసిన దౌర్జన్యమేమో, సంఘం నన్నింతపైడీలా గుంచి కోటికళ్లతో కనిపెట్టడానికి ? పెనిమిటి కావాలని నే నడగందే, వేడుకతీర్చుకుందికి, జరిపిన వివాహానికి దైవ ఘటనచేత విచ్ఛేదం వస్తే, ఆవైధవ్యం నా కెలాగవుతుంది? కావలిస్తే మా అమ్మమ్మని పాలించమనండి; ఆవైధవ్యం దానిదే! పొత్తిళ్లలోనే మాఅత్త నియోగించిన మాబావని, నైసర్గికంగా నీరు సముద్రానికి పోర్లినట్టు నాహృదయం చిన్ననాటినుంచీ ప్రవహించి చేరుకున్న మాబావని, కాదనిచెప్పి యేదోమృత్తికతో గట్టుకట్టడానికి ఛాందసలోకం ప్రయత్నించినప్పుడు, ఆగట్టు తెగిపోతే నాదా నష్టం ?.............అయితేనేం ? లోకం తన నెత్తిమీద నాపూచీఅంతా అవ్యాజంగా పెట్టుకుని నన్నుద్ధరించడానికి కంకణంకట్టుకుంది! ఆవలిస్తే పేగులులెక్కించే మా అమ్మమ్మపిలుపుతో రెక్కలుకట్టు కామె యెదుట యెలారాలనూ ? ఈనుదురూ నే నూను?—గబగబ సబ్బుతో తోమేసుకుని మాబావ చేరుమాలుతో తుడిచేసుకు బయట పడ్డాను. మాఅమ్మమ్మ వరండామీద యెదురై "జెష్టా, యిప్పుడా పాడుమొహం సింగారించుకోకపోతే, నెండలో పిడక లెత్తిపెట్టరాదూ ఓమాటు"అని ఒకఉరుమురిమి అట కెక్కిపోయింది. ఆచలిపిడుగుతాకున నిశ్చేష్టనై నిలబడిపోయేను!

*　　　*　　　*

జీవితం దుర్భరమైపోతూంది. భరింపరాని దుఃఖమూ, అంతకన్న సహింపజాలని స్వర్గ సౌఖ్యమూ కలిసి నాప్రతినిమిషములోనూ పడుగుపేకగా అల్లుకున్నాయి. చేతి కందు బాటులో వున్న మధుకలశం త్రాచుపాము ఉట్టిలో వుంది! ఇరుగుపొరుగులమ్మలక్కలు ఒకొక్క కావ్యం సృష్టించి గాలిలో ప్రచు రిస్తున్నారు నాగురించి. గుసగుసలూ, చేతి చాటు యిగిలింతలూ లావయ్యాయి. మహా రాజునుచూసి సామాన్యమానవు డైన ఓర్వ గలడా? లోకమంతా సృజించిన దేవుడు, న న్నొకర్తెనీ అందులో యెంపుచేసి కంటక పర్చడమే కార్యంగా పెట్టుకున్నాడా? లేదు. దేవుడికి నామీద దయే, నేనేం నేరంచెయ్య లేదుగనక. అందుచేత మాయిద్దరిమీద నూ లకీ సమానేశపర్చి, మూఢలోకాన్ని దేవుడే తిరస్కరించాడు.

* * *

ఎన్ని ముళ్లు ఆవరించివున్నా గులాబీ పుష్పించడం దైవఘటన. తాను చచ్చి పోయినా అరటిచెట్టు గెలవిడవడం నైసర్గిక పరిణామం. నాలో నా కొక నూతన జీవనకళ గోచరించడంమాత్రం విధికృత్యం కాదూ? నాకళ్లు, నీటిలో చంద్రబింబంలాంటి లేత నీలిమ దాల్చి, నల్లని గోటిగీటులాగ చుట్టూ పరివేషం కట్టేయి. చెక్కిళ్లలో అలసట చూపించే అందమైన వాడుదనంవచ్చింది.... నిశీథగర్భంలో, తారకకనైనా సోకని అజ్ఞాతప్రదేశంలో, ఎన్ని జీవరాసులు పున ర్జన్మ కల్హారా చూచుకోలేదూ? దిశలు మారుమ్రోగించే కెరటాల కల్లోలందాటి ప్రశాంతమైన నదీసముద్రం ప్రవేశించినట్టు, స్త్రీత్వం దాటి మాతృత్వా స్వీకరిస్తూన్న నన్ను గురించి ఊరివా రెందుకో కళ్లల్లో నిప్పులోసుకోడం?

* * *

ఆవేళరాత్రితో మాబావరుణం నాకు చెల్లిపోయింది. సర్వసాక్షియైన భగవంతుడు మాకోసమై ముత్యాలగొడుగు పట్టి, నట్ట నడుమ జాబిలిమీద మబ్బుపూత వేసివుండగా లోకానికి కాపలాకాస్తూన్న వృద్ధాచారం మా అమ్మమ్మకళ్లలోంచి మమ్మల్ని చూసింది......

నేటికి యేడాదైంది మాఅన్నయ్యని చూసి. మాఅమ్మమ్మ ఉందో చచ్చిపోయిం దోకూడా నే నెరగను. నిరుడీరోజుల్లో నా కేమీ తెలియచెప్పకుండా, రాత్రిరైలులో రాజమండ్రీ గోషాస్పత్రికి నన్ను తీసుకెళ్లేడు మాఅన్నయ్య. దారిలో నాభయం చెప్ప నలవికాదు. నేను లోలోన కుమిలి యేడుస్తూ వుంటే, మాఅన్నయ్య పైకిచెప్పడానికి సిగ్గు కొద్దీ, న న్నొక్కటి కొట్టేడు!......ఇప్పటి కైనా, ఆచెయ్యి యెంతనొప్పెట్టిందో అనిపి స్తుంది నాకు. ఆస్పత్రిగేటువద్ద గుబురుగావున్న చెట్లకింద నన్ను దింపి జట్కా వెనక్కు పంపేసి, "యిక్కడేవుం" డని నాతో చెప్పి-

అంతే, మరి నాకగపడలేదు, నాటికీ నేటికీ. ప్రపంచమంతకీ నే ననవసరమని తోచి నన్ను బహిష్కరించినప్పుడు నన్నాదరించింది క్లారా దొరసాని. ఆమె మొగం అందుచేతనే మా అమ్మని పోలిందనుకుంటాను; లేక, యేలోకం నుంచో వచ్చిన నామట్టిలో మొదట ప్రాణం పోసి పెంచిన వాత్సల్యంచేత మాఅమ్మే యిక్కడ క్లారాగా పునరుద్భవించిందో!

* * *

నన్ను తృణీకరించిన లోకమంతనీ నేనే భరించినంత సస్త్రాణిగా వుందని క్లారాతో చెప్పేసరికి ఆమె తనయింటపుట్టిన బిడ్డగా నన్నాదరించి నా కోగది యిచ్చింది. ఆగది ఒకభూలోకస్వర్గం. పంచభూతాలూ బాహాటంగా ప్రచారంచేస్తూంటాయి. అద్దపుకిటికీలు అవసరమైనప్పుడు వేసేస్తే, గర్భంలో శిశువులాగు లోపలివారికి బ్రహ్మానందంగా వుంటుంది. క్లారా తను స్వయంగా తెచ్చి ఒకగాజుగిన్నెతో "గ్లాకోస్" యిచ్చింది. నా స్థితి చూస్తే, మంచంమీద దిండ్ల కంటిపెట్టుకున్నాను. కనురెప్పలెత్తడం కష్టంగా వుంది. "త్వరగా తాగమ్మా, మరేం ఫర్వాలేదు. ఒక్కరాత్రి" అంది క్లారా. మెల్లగా లేచి కొంచెం తాగేను. జీవకారుణ్యంలో వున్న మధువే నాకు క్లారా చవిచూపింది! ఆతర్వాత ఒకఅరగంటకు నాచెవుల్లో స్రవు వెలిగించిన ఝూంకారం లేచింది. స్వప్నసీమ సైతం దాటి అలౌకికమైన గాఢసుషుప్తిలో పడిపోయేను!

* * *

సూర్యభగవానుడు సహస్రబాహువులు చాచి లోకమంతటినీ తట్టిలేపినవేళకు నాలో చైతన్యం మళ్లీ ప్రవేశించింది. ప్రక్కనదివరకున్న దిండు లేదు. నులివెచ్చగా నా బహిః ప్రాణం నాచిన్నికూన, సంఘంతో శత్రుత్వం వహించి సాధించుకున్న నా జన్మహక్కు, పొత్తిళ్లనడుమ నిండుకుండలో అమృతంలాగు తొణుకుతూంది! "అమ్మగారండీ, మొగపిల్లాడేనా?" అన్న నర్సుమాటలు నాచెవులకేదో దూరస్థమైన నేపథ్యంనుండి వినిపించేయి.

* * * *

మా అన్నయ్యేమో ఉత్తరం రాశాడు క్లారాపేర:— "శిశువును విడుచుకుని వచ్చేస్తే మర్యాదగా నన్నింట్లో పెట్టుగోవచ్చు"నని. మాఅన్నయ్య నామీద ఇంత కఠినత వహించివుండడు; రాక్షసిసంఘం నాకుటీరంలోనైనా నే సుఖంగావుండడం ఇచ్చగించక, వాడిచేత ఇట్లా రాయించింది. స్త్రీజన్మసిద్ధమైన పురుషప్రేమ నానుండి దోచుకున్నది చాలక, యీ మాతృప్రేమ కూడా నానుండి అపహరించి నన్నిహాపరాలు రెంటికీ దూరంచెయ్యడానికి, ఈ సంఘానికి నేనేం విషంపెట్టేనూ? వీరంతా నామర్యాద కాపాడ్డానికనిట, యీఎత్తులు! ఇంద్రపదవి

యిచ్చినా యేతల్లి, స్తన్యంవద్ద శిశువుని తిర స్కరించగలదూ?

నా చిన్నిపార్వతి, నా ముద్దులబాబు, పెద్దవాడయేక నాకు జన్మాంతరాలదాకా సరి పోయేప్రేమ చూపించడూ!… …క్లారా న న్నిప్పుడు పెళ్లాడమంటుంది. నా కక్కర్లేదు. మాతృత్వంతప్ప నాలో స్త్రీత్వ మెక్కడుంది? సంఘానికి వెరిచి మాబావ నాపంక చూడకుంటే పోనీ. స్వర్గమే వుంటే, అక్కడ గాలించి యేనాటికైనా మా బావని పట్టుకుని, ఆనాడు నిలువుటద్దంముందట నిలిచి నట్లు జంటగాచేరి, మాయీ ప్రతిబింబాన్ని చూసుకోమూ?

క్లారాయే ఇప్పుడు మాఅమ్మ. పార్వతే నాసర్వస్వమూనూ. నాకిప్పు డంతా ఆనంద మే. నాఆనందమంతా నాపార్వతికోసమే. ఇప్పుడు ప్రాకడంనేర్చి నాకుట్టుపని తోచ నివ్వడు. వియ్యాలలో వుంచడం మానుకున్నాను. తలకుపెట్టిన పూలుటోపీతో నా మెదట కిలకిలమని కొండసెలయేరులాగ వాడు నవ్వుతూవుంటే, ఇంద్రధనుస్సుతో చట్రంకట్టిన జాబిల్లినుంచి వెన్నెలకురిసినట్లుంటుంది. మిషనరీఅమ్మాయి లందరికీ నా బాబు జనముద్దూ. నానిద్రలో యిప్పుడు స్వప్నంరాదు. పుప్పొడిని త్రాగి మత్తిల్లి నట్టు, నావరాలమూటకు నతమప్పగించి కన్నుమూస్తే, లోక మేమైపోనీ నాకక్కర్లేదు.

ఇంతటిసౌభాగ్యం నాకు భగవంతుడు ప్రసాదించి, కడపట నాకు నరక మెందు కిస్తాడూ? స్వర్గద్వారంవద్ద యీరాక్షసులు మహారాజవాన్లుగా వుంటారా? లేక మా అమ్మమ్మయిష్టమా? నేను నమ్మను. ఈ డాంబికాలన్నీ నాలాటి అనాథలను చిత్రవధ చేయడానికి క్రూరలోకం చేసిన యేర్పాటు! గెంటివేసి పరమపదించే కదళికి యేనరలోకం వస్తే నేనూ అక్కడికే వెడతాను!!